# రొమాన్సు

శ్రీ ధనికొండ హనుమంతరావు

ఎంతకూ తరగని ఎండాకాలపు శెలవల్లో రామం వాళ్ల మేనమామగారి వూరుకు క్యాంపువేశాడు. అదో పల్లెటూరు. సామాన్యంగా—పట్టణవాసానికి అలవాటు పడ్డ ప్రతిప్రాణీ పల్లెటూరి జీవితాన్ని అనుభవించలేదు. ఎందుకూ అంటే — పల్లెటూరిలో 'రిక్రియేషన్'కు కావలసిన సినిమాలు మొదలయినవి వుండవుగనుక. ఏది ఎల్లావున్నా రామానికి మొదటలో ఏమీ తోచేది కాదు—కాని, తరువాత బలే కాలక్షేపానికి అవకాశం దొరికింది.

అసలు రామం మేనమామగారి ఇంట్లో మొత్తమంతా ముగ్గురు మెంబర్లు—ఇస్త్రోకు, పొడి, రామం ఎక్స్ట్రా అన్నమాట. రామం మేనమామ—వెంకట్రామయ్యగారు వ్యవసాయానికి వెళ్లేవాడు. అత్తగారు వంటపనిలోవుండేది. ఇంక మనరామం ఒక్కడూ మిగిలేవాడు; రామం మేనల్లుడు—ఆ రెండేళ్లకుర్రవాడు ఆడుకున్నంతసేపు ఆడుకునేవాడు; ఏమీ తోచకపోతే ఏడ్చేవాడు. ఆసమయంలో ఆ సత్రకాయను సముదాయించటం రామంపని.

వెంకట్రామయ్యగారిఇంటిప్రక్కనే ఒక కమ్మవారిఇల్లువుంది. ఆఇంటికీ, వీళ్లఇంటికీ మధ్య ఒక మొండిగోడ అడ్డం. రామం గదిలో కిటికీదగ్గర కూర్చుంటే ఎదురుకుండావున్న—ఆ బి. సి నాటి మొండిగోడ కనిపిస్తూవుంటుంది. ఆ గోడనుగురించి మనవాడు స్టడీ చేసేవాడు.

ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు ఒక ఇరవైఏళ్లపడుచు ఆ గోడదగ్గరకు వస్తుంది. మనిషి అందమైనదే! మరీ పల్లెటూరి పిల్లాకాదు—మరీ బస్తీ గొడ్డూకాదు—త్రిశంకు స్వర్గంలోని పిల్ల—అందాము. ఆ మొండిగోడకు అవతలమనిషి నిలుచుంటే సగం మనిషి ఇవతలకు కనిపిస్తుంది. ప్రతిరోజూ వుదయాన ఆ అమ్మాయి, ఆ గోడకు పిడకలు కొడుతూవుండేది. మన రామం—ఆ అమ్మాయిచేసేపని చూస్తూవుండేవాడు—పోలీసు సార్జంటు కానిస్టేబిల్ డ్రిల్లుచూస్తూవున్నట్టుగా! ఆ అమ్మాయికూడా కావాలని ఒకగంటసేపు ఆగోడదగ్గర తనపనిని తెమలనిచ్చేదికాదు. కొంటెతనంగా పమిటతో ఆటలాడుతూవుండేది. ఆ అమ్మాయి చూపుల్లోనూ చిరునవ్వుల్లోనూ కూడా కొంటెతనం స్పష్టంగా కనిపిస్తూవుండేది. రామం కిటికీదగ్గరనుంచి ఎక్కిరించటం—ఆ అమ్మాయి తిరిగి ఎక్కిరించటం—ఇత్యాది—సైలెంట్ ఫిలింలోని బొమ్మల్లాగు!

రెండువారాలు గడిచాయి. రామానికీ ఆ కమ్మపిల్లకూ చూపులతోనే ఏదో స్నేహం అంకురించింది. కాని ఆస్నేహాన్ని వారిద్దరిలో ఎవరూకూడా బయటపెట్టారు కాదు. రామం ఏదన్నా పుస్తకం తెరుస్తే ఆ అమ్మాయి ప్రత్యక్షమయ్యేది. ఏమీతోచక కాలుకాలిన పిల్లిలాగు ఇంట్లో తిరుగుతూవుండేవాడు; లేకపోతే మొండిగోడదగ్గరకువెళ్లి ఆ అమ్మాయి యేమి చేస్తూవున్నదో చూసేవాడు. అంతకన్న ఏం చేస్తాడు మరి?

ఆనాడు మధ్యాహ్నం భోజనాలయ్యాయి. కరణంగారితో ఏదో మాట్లాడాలని వెంకట్రామయ్య తోకముడిచాడు.

అత్త, రామంతో అన్నది—"వారెల్లి వారి కోడలు వచ్చిందట. చూసివస్తాను. ఇంట్లో జాగ్రతగా వుండు."

రామం 'సరే' అన్నట్టు తలవూపాడు. అత్త కుర్రవాడ్ని చంకనుపెట్టుకొని వారెల్లి వారింటికి వెళ్లింది.

రామానికి యేమీ తోచడంలేదు. ఆ కమ్మపిల్లనుచూద్దామని దొడ్లోకి పోబోయ్యాడు. ఇంతలోకీ "సుబ్బమ్మగారూ!" అని దొడ్లోనుంచి కేకవినిపించింది.

"ఎవరు?" అంటూ రామం దొడ్డి తలుపుతీసి దొడ్లోకి ప్రవేశించాడు.

ఇంకెవరుకి? ఆకమ్మపిల్లే! అంతా ఫిలిం స్టార్ వేషంలోవుంది. రామానికి అనేకభావాలు మనసులో లేకెత్తాయి గాని — ఎటుపోయి ఎటువస్తుందోనని కొంచెం పస్తాయించాడు.

ఆ కమ్మపిల్లే ఉపక్రమించింది.

"సుబ్బమ్మగారు లేరండీ?"

"దేనికి?"

"పనివుంది."

"నాతో చెప్పు—"

"మీతో చెప్పే పనికాదు."

"ఫరవాలేదు!"

"మీతో చెప్పేపని వేరేవుంది. అది ఇప్పుడు కాదు; తరువాత చెప్తాను."

రామానికి ఏమీ పాలుపోలేదు. ఆ అమ్మాయి మాట్లాడినది, ద్వంద్వార్థంలో వుంది.

"నీ పేరు?"

కమ్మపిల్ల నవ్వుతూ చెప్పింది. "శాంత"

"ఇప్పుడే వస్తుంది; కొంచెం కూర్చో."

"ఇక్కడ కూర్చుంటే ఎట్లా? పనికావద్దూ?"

"నువ్వు చేసే రాచకార్యాలు మించి పోతున్నాయా?"

సరసానికి దిగింది—సంభాషణ!

"అవును కాని...శాంతా!..."

"ఊఁ"

"మీ ఇంట్లో మగవాళ్లెవరూ లేరూ?"

"లేకేం? ఆయన పొలం పనిమీద వున్నారు."

"మరి నీకు ఏం తోస్తుంది?"

"అందుకనే ఇల్లా వచ్చా!"

"కులాసా కాలక్షేపానికా?"

"ఆఁ దానికే..."

"నీ కాలక్షేపానికి నేను పనికిరానూ?"— రామం దీనంగా ప్రశ్నించాడు.

"పనికిరారని—నేను అన్నానా?"—శాంత కొంటెగా జవాబుచెప్పింది, జారిపోతూవున్న పమిటను సర్దుకుంటూ.

రామానికి ఒకవిధమైన ధైర్యంవచ్చింది.

"అయితే నాగదిలోకొచ్చి మాట్లాడుకుందాం—రా"

"ఎవరైనా...చూస్తే..."

"చూస్తే తప్పేమివుంది? అంతా లోకం పోకడే!"

శాంత మాట్లాడలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు? ఇంట్లో ఎవ్వరూ లేరు. మరేం భయం లేదులే..."

రామం శాంత చెయ్యి పట్టుకున్నాడు—అతి మృదువుగా శాంత సున్నితంగా పట్టువిడిపించుకున్నది.

"ఇప్పుడు కాదులెండి—" శాంత అన్నది సిగ్గుతో తలవంచుకొని.

"మరెప్పుడు?"

"రాత్రికి ఆయన పొలం వెళ్తారు—మా ఇంటికి రండి."

వెంకట్రామయ్య తిరిగివచ్చి తలుపుకొట్టాడు. శాంతను త్వరగా పంపెయ్యటమే మంచి పనిగా తోచింది—రామానికి పానకంలో పుడకలాగువచ్చిన మామయ్యను మనస్సులో తిట్టుకున్నాడు.

"సరేకాని—శాంతా! రాత్రికి వస్తాను—నువ్వు వెళ్లిపో—ఏం?"

'సరే' అన్నట్టు శాంత తలవూపింది.

రామం, శాంత బుగ్గగిల్లాడు.

"ఊఁ" అంటూ దీర్ఘం తీసి—శాంత చిరునవ్వుతో నిష్క్రమించింది.

రామం, శాంతకూ తనకూ జరిగిన సంభాషణను అనేకసార్లు తలుచుకుంటూ, తనకు స్త్రీతో రొమాన్స్ సంభాషించటం ఇదే మొదటిసారయినా తన ఇంటర్మీడియట్ తెలివితేటలను వృధా పోనియ్యనందుకు సంతోషిస్తూ, తను రాత్రికి ఆడవలసిన నాటకానికి ఇప్పటినుంచే మనస్సులో రిహార్సల్స్ వేసుకుంటూ,

ఇంకేవేవో ఆలోచించుకుంటూ — సాయింకాలం వరకూ గడిపాడు!

సాయంత్రం పొలాలవేపు షికారు బయలు దేరాడు—రామం యేమీతోచక. అక్కడ పోస్టు మాస్టారి అబ్బాయి రాఘవరావు కన్పించాడు. అతను తన క్లాసుమేటేగాని—ఇన్నాళ్లూ వూళ్లోలేడు.

"ఏమోయ్! దర్శనమేకరువయింది—" రామం ప్రశ్నించాడు.

"వూళ్లో లేను. ప్రొద్దునేవచ్చాను."

ఇద్దరూకలసి, పొలాలమీదనుంచి వచ్చే పైరు గాలిని మేస్తూవెళ్లి—ఒక దిబ్బమీద బిఛాణాపరిచారు. ఏవేవో మాట్లాడుకున్నారు. ఆమాటమీద, యీమాట మీద—యువకరక్తం కాబట్టి 'రోమాన్స్' కూడా చర్చనీయాంశమయింది.

"ఎరుగో!—జాగ్రత్తోయ్! మీ ఇంటిప్రక్కనే వున్నాడే రామయ్య......"

"ఎవరూ?"

"ఊఁ. ఆ కమ్మాయన్నోయ్! ఆయన భార్యా వుంది—శాంత. నువ్వు చూడలేదూ?"

"ఊఁ. ఒకటి రెండుసార్లు చూశాలే!"

రామానికి, రాఘవరావు ఏం చెప్తాడోనని కుతూహలంగావుంది.

"అది పచ్చిరేక్! జాగ్రత. దాని వలలో పడ్డా వంటే నీకు తరుణోపాయం లేదు..."

"మనకు అటువంటి విషయాల్లో జోక్యం లేదులే!"—రామం అన్నాడు — అమాయకత్వాన్ని నటిస్తూ.

"అదికాదు; దానిదగ్గర చెప్పరాని సుఖవ్యాధులు వున్నాయి. ఎందుకయినా మంచిదని, నీకు ముందే హెచ్చరిక ఇస్తున్నాను—ఏమీ అనుకోకు."

రామానికి ఏమి మాట్లాడేందుకూ తోచింది కాదు. తను మధ్యాహ్నమంతా మనస్సులో కట్టుకున్న గాలిమేడలు కూలిపొయ్యాయి; ఆ మధ్యాహ్నం జరిగిన సంగతి, రాఘవరావుకు చెప్దామనుకున్నాడు, కాని, బాగుండదని వూరుకున్నాడు ఇంతలో చీకటిపడటం వల్ల ఎవరి ఇళ్లకు వాళ్లు సర్దుకున్నారు.

రామం మనస్సేమీ బాగుండలేదు. తనలో రేకెత్తిన వున్నత భావాలన్నిటినీ రాఘవరావు పటాపంచలుచేశాడు. సుఖరోగాలమాట విన్నప్పటినుంచీ రామానికి గుండె జారిపోయింది. క్రిందటిసంవత్సరం, రామం రూమ్మేటు సుఖరోగాలతోపడ్డ అవస్థ, తను వాడికిచేసిన చాకిరీ—ఇత్యాది జ్ఞాపకానికి వచ్చాయి. ఆ సుఖరోగాలకు గురవయ్యాడా రామం అందరికీ అలుసవుతాడు. తనను అందరూ హేళనచేస్తారు. శాంతతో తను ఆమధ్యాహ్నం ఆడిన సరసమంతా—విరసమయింది; తన ప్రయత్నమంతా బూడిదలోపోసిన పన్నీరయింది. కాని, రాఘవరావు తనకు దేవుడల్లే వున్న సంగతి చెప్పటంవల్ల తను ముందుగానే మేలుకోవచ్చును. నిజమే! రాఘవరావు తనకాసంగతి చెప్పకుండావుంటే అన్యాయంగా దెబ్బతినేవాడు. అయితే తను శాంతను ప్రేమిస్తున్నాడా? లేక దేహసౌఖ్యం కోసం శాంతను కోరాడా? నిజంగా ప్రేమిస్తూవుంటే —ప్రేమకు సుఖరోగాల్ని నెట్టే శక్తిలేదూ? పోనీ తనది ప్రేమయితే నేం—కాకుంటే నేం—ఎవరికి కావాలి? పోని అని తెగించివెళ్తే ఇంకేమౌస్తుందో? ఇదే తన ప్రథమ ప్రయత్నం. పరాయి ఇంట్లోకి, అర్ధరాత్రప్పుడు తను వెళ్లటం—ఇది బయిటపడితే రసాభాస. ఆపిల్ల భర్త కంటపడితే తనకు దేహశుద్ధి. ఊళ్లో తనకు తాటాకుల కట్టేస్తారు—ఒకటా? అంతా ఆలోచించాడు. మనస్సులో వితర్కించుకున్నాడు. చివరకు, రామం వెళ్లకూడదని నిశ్చయించుకున్నాడు.

రాత్రి భోజనంచేసి పడుకున్నాడన్నమాటేగాని, శాంత సంగతే—ఆమెకు తనుచేసిన వాగ్దానమే—ఆమె సౌందర్యమే—అతని మనస్సులో సినిమా బొమ్మల్లాగు తిరిగాయి. రామం మరోటి ఆలోచించాడు—అయినా ఇంత చిన్న యీడులోవున్న పిల్లదగ్గర సుఖరోగాలు వుంటాయా? రామం మళ్లీ ఆలోచించాడు—ఆమె కాకుంటేనేం? ఆమె భర్త పోకిరవకూడదూ?. ఛత్—మానుకోవటమే మంచిది. రాత్రల్లా ఏవేవో ఆలోచనలతో గడిపాడు. తెల్లగా తెల్లవారి నిద్ర లేచాడు.

ఆనాడు మధ్యాహ్నం—

వెంకట్రామయ్య పొలం పనిమీద వెళ్లాడు. అత్తయ్య పొరుగింటికి వెళ్లింది. రామం దొడ్లోకి వచ్చాడు—ఎందుకో అతనికీ తెలియదు. శాంతవచ్చింది—నవ్వుకుంటూ. రామం తెల్లబొయ్యాడు.

"మిమ్మల్ని నమ్ముకుంటే....."

శాంత విరగపడి నవ్వుతూవుంది.

రామం యేమీ మాట్లాడలేదు.

"రాత్రివస్తానని—వచ్చారు...కాదూ?"

ఆమె ఇంకా నవ్వుతూనేవుంది. రామం లేని నవ్వు తెప్పించుకున్నాడు లౌక్యంగా!

"రాత్రి వీలవలేదు—ఏం చెయ్యమంటావు?"

"అవును. ఎందుకు వీలవుతుంది? అంతకన్న ఆమాట అనకుండావుంటే ఎంతో బాగుండేది,"

"అప్పుడే అంతకోపం ఎందుకు?"

"నాకేం కోపం? మీరు ఎందుకు రాలేదో నిజం తెలుసుకుందామని అడిగాను—అంతే!"

తను ఏదన్నా నాకుచెప్పి తప్పించుకుందామనుకున్నాడు రామం; కాని తరువాత శాంత తనను ఇప్పుడు ఆహ్వానిస్తే? తనకు తప్పని సరవుతుంది. పోనీ నిజం చెప్పివేస్తే? ఏమనుకుంటుందో?

"ఏం—చెప్పరు?"—శాంత దీనంగా అడిగింది.

రామానికి తెలియకుండానే అతని నోటివెంట మాటలు వచ్చేస్తున్నాయి:

"మఱి...నేను...ఒకటి ... అడుగు...తాను ...కాని...నిజం ... చెప్తావూ?" — రామం నీళ్లు నమిలాడు.

"ఆఁ"—శాంత తలవూపింది.

ఆమె రామం అడిగేదానికి నిరీక్షిస్తూవుంది.

"నీ...దగ్గర ... సుఖ...రోగాలు ... వున్నాయిటగా...?"—రామం అనేశాడు అప్రయత్నంగా. అన్నాక అతనిగుండె పీచుపీచుమన్నది. పొరపాటయిందనుకొని నాలుక కొరుక్కున్నాడు.

శాంత తలవంచుకొని అడిగింది—

"ఎవరుచెప్పారు?

రామం, తను తిరిగి సమాధానం చెప్పవలసివచ్చినందుకు నొచ్చుకున్నాడు. గోడమీది పిల్లి వాటంగా సమాధానం ఇచ్చాడు—

"ఎవరయితే నేంలే! నువ్వు నిజం చెప్పు."

"నిజమే! కాని....."

రామం తను విజయం పొందినట్టుగా తలిచాడు. రాఘవరావుకు మనస్సులో నమస్కారాలు పెట్టుకున్నాడు.

"ఊఁ...కాని...

"కాని...మీరు...పురుషులు...కారా?"

దీనికేమి సమాధానం చెప్పాలో రామానికి తోచిందికాదు. సంభాషణ ఇల్లా వస్తుందనుకోలేదు. పురుషుణ్ణే — అంటే — 'ఇదేనా నీ పురుషత్వం' అంటుందేమో. స్త్రీనంటే—తన పరువుపోతుంది. ఏం చెయ్యాలి? రామానికి ఆమెమీద విరక్తి పుట్టింది—ఆమెను త్వరగా అక్కడినుంచి పంపకపోతే తనకు 'ఎసరు' వస్తుంది. అత్త వచ్చేవేళయింది—రామం బిత్తరపోయి చూస్తున్నాడు.

"ఏం...మాట్లాడరు?"

"ఏం మాట్లాడాలి?" రామం గంభీరంగా అన్నాడు.

"మీరు పురుషులా? కారా?"—శాంత కచ్చితంగా ప్రశ్నించింది.

అత్తవచ్చి తలుపు కొడుతూవుంది. రామం, మాటే కదా—అనుకున్నాడు. నిశ్చయించుకొని సమాధానం చెప్పాడు—

"కాను"

"అయితే స్త్రీవా"—శాంత తిరిగి ప్రశ్నించింది. రామానికి గోరుచుట్టుమీద రోకటిపోటులాగ వుంది. తప్పని సరిగా రామం అన్నాడు—"ఊఁ."

"అయితే చేతులకు తొడిగించుకోండి!"—

బుగ్గలు గుంటలుపడేటట్టు, నవ్వుతూ—శాంత వెళ్ళిపోయింది!